మొక్కల సంరక్షణపై దృష్టి

- అర్వపల్లి మండలంలో 17 నర్సరీలు
- 1,79,850 మొక్కలు పెంచడం లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు
- ముమ్మరంగా షేడ్‌నెట్‌ల ఏర్పాటు



అర్వపల్లిలోని నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

అర్వపల్లి : మండలంలోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కల సంరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఏడాది ప్రభుత్వం నిర్వహించే వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో మొత్తం 17 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని ఊరల్లో ఒక నర్సరీ చొప్పున ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీలో 10 నుంచి 12 వేల వరకు మొక్కలు పెంచుతున్నారు. ఇప్పటికే నర్సరీల్లో సంచుల్లో సారవంతమైన మట్టిని నింపి గింజలు నాటగా అవి మొలకెత్తాయి. వాటికి ఉపాధి హామీ సిబ్బంది సంరక్షిస్తున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు నర్సరీలను పర్యవేక్షిస్తున్నారకు. ఉదయం, సాయంత్రం వేళలో మొక్కలకు సిబ్బంది విధిగా నీటిని అందిస్తున్నారు. కాగా, మండల వ్యాప్తంగా నర్సరీల్లో మొత్తం 1,79,850 మొక్కలు పెంచి ఈ ఏడాది జరిగే వనమహోత్సవానికి సిద్ధం చేస్తున్నారు.

షేడ్‌నెట్‌ల ఏర్పాటు..

వేసవిలో ఎండల దృష్ట్యా మండలంలోని నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని చోట్ల మొక్కలు ఎండిపోగా వాటి స్థానంలో మళ్లీ కొత్తగా గింజలు నాటుతున్నారు. నర్సరీల్లో మారేడు, కానుగ, మునగ, రావి, కుంకుడు, ఉసిరి, సీతాఫలం, ఈత, కదంబం, బహోనియా, జామ తదితర మొక్కలను పెంచుతున్నారు. ఈ విడత వనమహోత్సవానికి సుమారు రూ.2 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

1,79,850 మొక్కలు పెంచుతున్నాం

మండల వ్యాప్తంగా 17 నర్సరీల్లో 1,79,850 మొక్కలు పెంచుతున్నాం. మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. ఎండ కాలంలో మొక్కలు ఎండిపోకుండా షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేస్తున్నాం. షేడ్‌నెట్‌ల పనులు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి. జూన్‌లో వర్షాలు పడగానే మొక్కల పంపిణీ నిర్వహిస్తాం.

– సీహెచ్.ఉపేందర్, ఏపీఓ

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి డోలోత్సవం



ఊయలలో ఉత్సవమూర్తులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి డోలోత్సవం (ఊంజల్ సేవ)ను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముందు ఆలయంలో విశ్వక్సేనారాధన పుణ్యాహవచనం జరిపారు. ఈ సందర్భంగా ఆదిశేషుడిపై నర్సింహస్వామి, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవిలు అధిరోహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను ఊయలలో ఉంచి డోలోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పవళింపు సేవను జరిపారు. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణానికి చెందిన శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సభ్యులు భజనలు వేస్తూ కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొప్రపిడత అవిలయ్య, ధర్మకర్త దండ వెంకట్‌రెడ్డి, ఎంఆర్‌ఎఫ్ టైర్స్ డీలర్ గుండగాని వెంకటేశ్వర్లు, అర్చకస్వాములు రాంబాబుఅయ్యంగార్, పవన్ కుమార్, ఆనంద్‌దీక్షితులు, మాధవచార్యులు, చక్రవర్తి, ప్రభాకరచార్యులు, నర్సింహదీక్షితులు, శిగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి జన్మదిన శుభాకాంక్షలు



ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు, పోలీస్ సిబ్బంది

చదువుతోనే భవిష్యత్తు



ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ మద్ది నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకట సాయి ఒకేషనల్ జూనియర్ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీవితంలో ఏది సాధించాలన్నా చదువుతోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా మొదటి సంవత్సరం ఫలితాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ కారింగుల విజయలక్ష్మి, కరస్పాండెంట్ కారింగుల బాలగౌడ్, ప్రిన్సిపల్ స్వాతిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

తుంగతుర్తి నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

– సాక్షినెట్‌వర్క్



అర్వపల్లి : తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వపరిపాలన వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



తిరుమలగిరి (తుంగతుర్తి) : స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు



నాగారం : ఈటూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో..



తుంగతుర్తి : వెంపటి ప్రాథమిక పాఠశాలలో..



మద్దిరాల : ముకుందాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

సాంకేతిక లోపాలు లేకుండా అమలు చేయాలి



మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి

భానుపురి (సూర్యాపేట) : ఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా రైతు భరోసా, రుణమాఫీ అమలు చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన తెలంగాణ రైతుసంఘం జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా ఎన్నికల ముందు రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా వెంకటరెడ్డి, జిల్లా ఆఫీస్ బేరర్స్ మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కందాల శంకర్ రెడ్డి, దుగ్గి బ్రహ్మం, మందడి రామిరెడ్డి, దేవరం వెంకటరెడ్డి, బెల్లంకొండ సత్యనారాయణ, ఉప్పలయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో క్యాన్సర్ రోగులకు ఉచిత వైద్యం



మాట్లాడుతున్న రేడియేషన్ అంకాలజిస్ట్ నివాళిక

సూర్యాపేటటౌన్ : క్యాన్సర్ రోగులు ఆరోగ్యశ్రీ ద్వారా అత్యాధునిక చికిత్స పొందవచ్చని హైదరాబాద్ మలక్‌పేట యశోద హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్, రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ నివాళిక చెప్పారు. క్యాన్సర్ చికిత్స పొంది ఇప్పుడు హాయిగా జీవిస్తున్న పలువురితో మంగళవారం సూర్యాపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో క్యాన్సర్ వస్తే ఇక జీవితం ముగిసినట్లేనని అనుకునేవారని, అంతే కాకుండా చికిత్స కోసం అంత డబ్బు లేదని భయపడి ఆసుపత్రికి వచ్చేవారు కాదన్నారు. ఇప్పుడు నిరుపేదలకు కూడా ఆరోగ్యశ్రీ తో ఉచితంగా అనేక అత్యాధునిక రేడియేషన్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరు నెలలకు ఒకసారి ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది, మాజీ సర్పంచ్ జటంగి వెంకటేశ్వర్లు యాదవ్ అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సందర్శించి, భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకట్‌నారాయణ, మాజీ ఎంపీపీలు రౌతు నర్సింహరావు, ధరావతు వీరన్ననాయక్, ధరావతు కుమారి బాబునాయక్, మాజీ జెడ్పీటీసీలు జీడి భిక్షం, భుక్యా సంజీవ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల పరామర్శ

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది జటంగి వెంకటేశ్వర్లు యాదవ్ (58) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. మంగళవారం మృతదేహాన్ని సీపీఎం నాయకులు సందర్శించి, భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారిలో పార్టీజిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, మట్టపల్లి సైదులుయాదవ్, కోట గోపి, వేల్పుల వెంకన్న, రవి తదితరులు ఉన్నారు.

మల్లేపాక వీరయ్యకు నివాళి

నాగారం : మండలంలోని పసునూర్ గ్రామానికి చెందిన మల్లేపాక వీరయ్య మంగళవారం అనారోగ్యంతో మరణించాడు. మృతుడి మృతదేహాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోశారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, కమటం శ్రీను, చిత్తలూరి వెంకటయ్య, బిక్కి శ్రీను, మామిడి నాగయ్య, పంది శ్రీనివాస్, బుచ్చిరాములు పాల్గొన్నారు.

మృతికి సంతాపం

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది జటంగి వెంకటేశ్వర్లు యాదవ్ (58) అనారోగ్యంతో సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన మృతి పట్ల సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సంతాపం వ్యక్తం చేస్తూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విధులు బహిష్కరించారు. అనంతరం సూర్యాపేట జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బార్ అసోషియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.కార్యక్రమంలో బార్ అసోషియేసన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

మద్దిరాల : మండలంలోని గోరెంట్ల జిల్లా పరిషత్

సంక్షిప్త సమాచారం

ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన సంగని విద్యాసాగర్ కుమార్తె సాహస్ర కోరిక మేరకు మంగళవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మద్దిరాల : యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్ఐ పానుగోటి మల్లయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోరెంట్ల గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పోలీస్ కళాజాతలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షరీఫ్ ఉనీసా బేగం, పోలీస్ సిబ్బంది రాజేష్, హోంగార్డు వెంకన్న, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గురులింగం, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా మోడల్ స్కూల్ వార్షికోత్సవం

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ఎంఈఓ ధారాసింగ్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ఆత్మకూర్(ఎస్) : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్ పరిశీలించారు. మండల వ్యాప్తంగా 52మంది ఓటర్లు ఉన్నారని, మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతులో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

అర్వపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి అర్వపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం జాజిరెడ్డిగూడెం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంఈఓ బి. బాలునాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం యాకలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ఎస్సీ మాలకాలనీలో కొన్ని నెలలుగా గ్రామపంచాయతీ నల్లాలు రాక నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ విషయంపై ప్రజావాణి వినిపించేదెలా అనే శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి గ్రామపంచాయతీ వారు స్పందించారు. ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి ఎస్సీ మాలకాలనీకి మంగళవారం నీటిని సరఫరా చేశారు కార్యక్రమంలో గండమళ్ల ఎల్లేష్, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలి

పెన్‌పహాడ్: ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని ఎంఈఓ నకిరేకంటి రవి పిలుపునిచ్చారు. మంగళవారం పెన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సూర్యాపేట గ్రీన్‌క్లబ్ సూర్యాపేట ఆధ్వర్యంలో విద్యార్థులకు క్లాత్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పారపు నరేందర్,మారం పవిత్ర, తోట కిరణ్, మిర్యాల వెంకటేశ్వర్లు, పీవీ లక్ష్మీనారాయణ, రామచంద్రయ్య పాల్గొన్నారు.

చేతిసంచులతో పర్యావరణానికి మేలు

సూర్యాపేట : పర్యావరణ పరిరక్షణకు చేతిసంచులు మేలని గ్రీన్ క్లబ్ ట్రస్టు చైర్మన్ ముప్పారపు నరేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని బాలెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతి సంచులను ప్రధానోపాధ్యాయుడు జెల్లా ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రీన్ క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకంతో జరిగే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు తల్లాడ రామచంద్రయ్య, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు నర్సయ్య, అశోక్, సైదులు, సోమశేఖర్, సోమయ్య, పద్మావతి, సంధ్యారాణి, చంద్రశేఖర్, పుల్లయ్య, వెంకటయ్య, ఖాదర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు చేతి సంచులు పంపిణీ చేస్తున్న గ్రీన్‌క్లబ్ ట్రస్టు చైర్మన్ ముప్పారపు నరేందర్

శివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబు



అర్వపల్లి : బొల్లంపల్లిలో ముస్తాబైన శివాలయం

అర్వపల్లి : మండలంలోని జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి, పర్సాయపల్లి, బొల్లంపల్లి, తిమ్మాపురం, కొమ్మాల, కోడూరు తదితర గ్రామాల్లో బుధవారం జరిగే మహాశివరాత్రి వేడుకలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముస్తాబైన శివాలయాలు

నాగారం : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని పసునూర్ గ్రామంలో ఉన్న భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయం, నాగారం, ఫణిగిరి, వర్ధమానుకోట తదితర గ్రామాల్లోని శివాలయాలు ముస్తాబయ్యాయి. శివాలయాలకు రంగులు వేసి, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆయా ఆలయాల్లో బుధవారం స్వామివారి కల్యాణం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆత్మకూర్(ఎస్) : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా శివాలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. మండల కేంద్రంలోని శివాలయంతో పాటు ఏనుబాముల, నెమ్మికల్, పాతర్లపహాడ్, ఏపూరు, కోటపహాడ్‌తో పాటు పలు గ్రామాల్లోని శైవదేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పిల్లలమర్రిలో ప్రారంభమైన ఉత్సవాలు

సూర్యాపేట: సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రిలో శివరాత్రి వేడుకలు మంగళవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. మహాదేవ నామేశ్వరాలయంలో ఆలయ ప్రవేశం, గణపతిపూజ, స్వస్తివాచనం, రక్షాబంధనం, అంకురారోపణ, సకల దేవతా ఆహ్వానం, కలశ స్థాపన చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ గవ్వ వెంకటకృష్ణారెడ్డి, రిటైర్డ్ అదనపు ఎస్పీ గంగాధర సత్యనారాయణ, చెన్నకేశవస్వామి దేవాలయ చైర్మన్ రాజబాబురెడ్డి, కందగట్ల రాంబాబు, గ్రామ పురోహితులు పులిహరిప్రసాద్ శర్మ, దేవాలయ అర్చకులు మునగలేటి సంతోషశర్మ, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాల వివరాలు

26న తెల్లవారు జామునుంచి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, మధ్యాహ్నం 1: 30 వరకు సామూహిక అభిషేకాలు, ధ్వజారోహణ, బసవ ముద్ద, జాగరణ, రాత్రి 12 గంటలకు స్వామివార్ల కల్యాణ మహోత్సవం, 27న తెల్లవారుజామున 3 గంటలకు రథోత్సవం, రుద్ర హోమం, నవగ్రహ హోమం, 28న తెల్లవారుజామున 3 గంటలకు అగ్నిగుండాలు, మార్చి 1న ఉదయం అభిషేకం, సాయంత్రం త్రిశూల స్నానం, స్వామివారి ఏకాంత సేవతో కార్యక్రమాలు ముగుస్తాయి.

ప్రశాంతంగా జరుపుకోవాలి : డీఎస్పీ రవి

శివరాత్రి సందర్భంగా పిల్లలమర్రిలో వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ రవి కోరారు. మంగళవారం పిల్లలమర్రి దేవాలయాలను సందర్శించి పూజలు చేశారు. అనంతరం సీఐ రాజశేఖర్, ఎస్ఐ బాలునాయక్‌కు సూచనలు చేశారు.

జయ పాఠశాలలో శివలింగాకృతిలో దీపాలు

సూర్యాపేటటౌన్ : మహాశివరాత్రిని పురస్కరించుకొని పట్టణంలోని జయ పాఠశాలలో మంగళవారం సాయంత్రం విద్యార్థులు శివలింగాకృతిలో దీపాలను వెలిగించారు. ఈ ఆకృతి పలువురు చూపరులను ఎంతగానో ఆకర్షించింది.



ఆత్మకూర్(ఎస్) : జలబిందెలతో మహిళలు



పిల్లలమర్రి దేవాలయ పరిసరాల్లో లైట్ల వెలుగులు



ఆత్మకూర్(ఎస్) : శివరాత్రికి ముస్తాబైన మండల కేంద్రంలోని శివాలయం



సూర్యాపేట టౌన్ : జయ పాఠశాలలో శివలింగాకృతిలో దీపాలు వెలిగించిన విద్యార్థులు

క్లుప్తంగా

కేజీబీవీ తనిఖీ



అర్వపల్లిలోని కేజీబీవీలో కంప్యూటర్ గదిని పరిశీలిస్తున్న ఎంఈఓ బాలునాయక్

అర్వపల్లి: అర్వపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంఈఓ బి. బాలునాయక్ మంగళవారం తనిఖీ చేశారు. వంట, స్టోర్ రూం, కంప్యూటర్ గది, తరగతి గదులను పరిశీలించారు. బాలికలతో మాట్లాడారు. బాలికల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జలగం పురుషోత్తం, ఎస్ఓ నాగరాణి, పీఈటీ, సీఆర్‌టీలు పాల్గొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం

నూతనకల్ : మండల కేంద్రంలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ లోక కల్యాణ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ కాసోజు సుమలతమధనచారి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కల్యాణ వేడుకలో భాగంగా స్వామివారికి సుప్రభాతసేవ, అభిషేకం, అర్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ పీఠాధిపతి, ఆలయ అర్చకులు జూలూరి రామాచారి ఆధ్వర్యంలో స్వామివారి లోక కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆమె కోరారు.

పూర్వవిద్యార్థి చేయూత నివ్వడం అభినందనీయం

పెన్‌పహాడ్: పాఠశాల అభివృద్ధికి చేయూత నివ్వడం అభినందనీయమని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మామిడి వెంకన్న అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి గద్దల నాగయ్య తన తల్లిదండ్రులు గద్దల లక్ష్మమ్మ–ఇద్దయ్య జ్ఞాపకార్థం పాఠశాల గోడలపై దేశ నాయకుల బొమ్మలు వేయించడం కోసం రూ. 5వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం గద్దల నాగయ్యవెంకటరమణ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పందిరి రేణుక, పంచాయతీ కార్యదర్శి జాని, ఉపాధ్యాయులు విజయకుమారి, వై. వెంకన్న, ఎస్. విప్లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని ధర్నా



ఆందోళన చేస్తున్న భీమ్లాతండావాసులు

చివ్వెంల(సూర్యాపేట) : ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని కోరుతూ చివ్వెంల మండలంలోని భీమ్లాతండా వాసులు మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల అధికారులు గ్రామంలో సమావేశం నిర్వహించి 28 మందికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం పట్టాలు అందించారని, ప్రస్తుతం 11 మంది పేర్లు మాత్రమే తుది జాబితాలో ప్రకటించారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శిని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేసి ఇళ్లు ఇప్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో ధరావతు ప్రమీల, ధరావతు మౌనిక, ధరావతు పోర, ధరావతు కొర్ర, ధరావతు దేవిక, భానోతు నీలా, బంగారి, సుజాత, కవిత, బుజ్జి, సుశీల, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సూర్యాపేటటౌన్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20శాతం నిధులు కేటాయించేలా అసెంబ్లీలో మాట్లాడాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డికి పీడీఎస్‌యూ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు దాదాపు రూ.8వేల కోట్లు ఉన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారి కూడా విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు సింహాద్రి, అందడి శ్రీధర్, కిరణ్, మహేష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పెన్‌పహాడ్ : మండలంలోని లింగాల గ్రామంలో గల శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర, భక్తాంజనేయస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా బుధవారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు శివాలయ కమిటీ చైర్మన్ దాచేపల్లి సుధాకర్, పురోహితులు ఇరువంటి సత్యనారాయణ శర్మ తెలిపారు. మంగళవారం దేవాలయంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మజ్జిగపు నర్సిరెడ్డి, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.